
గాగిల్లాపూర్‌లో కొండచిలువ కలకలం

బెజ్జంకి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండలంలోని గాగిల్లాపూర్‌లో కొండచిలువ కలకలం రేపింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గాగిల్లాపూర్ ఎస్సీకాలనీ సమీపంలో రోడ్డుపై వెళ్తున్న భారీ కొండచిలువను స్థానికులు గమనించారు. కాసేపటికి కొండచిలువ సమీపంలోని చెట్ల పొదల్లోని ఓ చెట్టుపైకి వెళ్లింది. కొండచిలువను చెట్టు నుంచి కిందకు దింపి వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు. ఎంతకూ కొండచిలువ కిందకు దిగకపోవడంతో భయంతో కర్రలతో కొట్టి చంపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

మంగళవారం 26 నవంబరు 2024









చలి వణికిస్తున్నది

- పొగమంచు.. ఈదురుగాలుల ప్రభావం
- నవంబరులోనే రికార్డుస్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి మెదక్ జిల్లాకు ఎల్లో అలర్ట్
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

మెదక్/కోహిర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వణికిస్తున్నది. జిల్లావ్యాప్తంగా అత్యల్ప రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో ఆదివారం రాత్రి 8.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని న్యాల్‌కల్ 9.6, కంగ్టి 9.8, గుమ్మడిదల 10, అందోలు 10.8, జహీరాబాద్ 11.1, నిజాంపేట్ 11.1, పుల్కల్ 11.1, సిర్గాపూర్ 11.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్ జిల్లా వెల్దుర్తిలో 11.2, రామాయంపేట 11.2, కౌడిపల్లి 11.3, చిలప్‌చెడ్ 11.6 టేక్మాల్ 11.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా పరిధిలో పోతిరెడ్డిపేట 10.9, బేగంపేట 10.9, మర్కుక్ 11.0, నంగనూరు 11, కొండపాక 11.3, దుబ్బాక 11.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రికార్డు స్థాయిలో..

ఉమ్మడి మెదక్ జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువే నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల వరకు పొగమంచు కప్పేస్తున్నది. చలికి ఈదురుగాలులు తోడవడంతో ప్రజలు ఇంటి నుంచి కాలు బయపెట్టాలంటేనే జంకుతున్నారు. ఉదయాన్నే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, పాలు, పేపర్ వేసేవారు, చిరువ్యాపారులు, తెల్లవారుజామునే పరిశ్రమలకు వెళ్లేవారు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. డిసెంబరులో నమోదు కావాల్సిన చలి ఈసారి నవంబరులోనే నమోదవుతున్నదని అధికారులు తెలిపారు. హృద్రోగులు, శ్వాశకోశ వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



సర్వే వివరాల నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్

సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

బెజ్జంకి/కోహెడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు కంప్యూటరీకరణ పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న కుటుంబ సర్వే వివరాల నమోదును సోమవారం పరిశీలించారు. ఆపరేటర్లు, అధికారులతో నమోదు తీరును అడిగి తెలుసుకున్నారు. వివరాల నమోదులో నిజనిర్ధారణ తప్పనిసరిగా పాటించాలని తప్పులకు ఆస్కారం లేకుండా చూసుకుని నమోదు చేయాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలోని వసతులను పరిశీలించారు. అదనపు తరగతుల కోసం నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో మంజుల, ఎం ఈవో మహతి లక్ష్మీ, ప్రిన్సిపల్ శ్వేత పాల్గొన్నారు.

అలసత్వం వద్దు..

ధాన్యం కొనుగోలులో ఎలాంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ మనుచౌదరి హెచ్చరించారు. సోమవారం మండలంలోని శనిగరంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. తేమశాతం రాగానే లారీలలో లోడ్ చేయించాలని అధికారులకు ఆదేశించారు. కారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేసి 48 గంటల్లోగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని అధికారులకు చెప్పారు.

ప్రాణం పోస్తున్నారు

- తక్కువ బరువుతో పుట్టిన వారికి ఎస్ఎన్‌సీయూలో వైద్యసేవలు
- 2018 నుంచి ఇప్పటి వరకు 9,293 మంది చిన్నారుల చేరిక
- 7956 మంది డిశ్చార్జి, 12 నుంచి 1 శాతానికి తగ్గిన రెఫరల్
- రాష్ట్రంలో నంబర్‌వన్‌గా నిలిచిన జీజీహెచ్ ఎస్ఎన్‌సీయూ సెంటర్
- ఐదేళ్ల చిన్నారులకు ఎన్ఆర్‌సీలో హియరింగ్, కంటిచూపు పరీక్షలు
- కలిసికట్టుగా శ్రమిస్తున్న ప్రభుత్వ పీడీయాట్రిక్ వైద్య విభాగం



కంగారూ ఫాదర్ కేర్ పద్ధతిలో పసిపిల్లలకు వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

సిద్దిపేటటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మరికొద్ది నెలల్లో తమకు పండంటి బిడ్డ పుట్టబోతుందని జగిత్యాల జిల్లాకు చెందిన ఓ జంట ఎంతో ఆనందపడింది. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు ఆ జంట వచ్చింది. అయితే, నెలలు నిండకముందే 1.2 కిలోల బరువుతో బిడ్డ పుట్టింది. నెలల పూర్తిగా నిండకముందే తక్కువ బరువుతో జన్మించడంతో తల్లిదండ్రులు కుటుంబీకులు ఆందోళన చెందారు.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాల్సి వస్తుందేమోనని ఆందోళనలో పడ్డారు. అయితే సిద్దిపేట జీజీహెచ్ ఆసుపత్రిలోని పసిపిల్లల విభాగంలోని నవజాత శిశు కేంద్రంలో చికిత్సను అందిస్తుండడంతో ఇప్పుడిప్పుడే ఆ బిడ్డ కోలుకుంటుంది. క్రమంగా బరువు పెరుగుతుండడంతో ఆ తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో చికిత్స పొందుతున్న 1.2 కిలోల చిన్నారి

యేటా 1500 నుంచి 2వేల మంది లోపు చిన్నారులు తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. వారిని అమ్మలా అక్కున చేర్చుకుని మెరుగైన వైద్యసేవలు అందిస్తూ సిద్దిపేట జీజీహెచ్ వైద్యులు ఆదర్శంగా నిలుస్తున్నారు. 700 గ్రాముల నుంచి మొదలుకుని 1500 గ్రాముల లోపు చిన్నారులకు 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో నిరంతరాయంగా సేవలనందిస్తూ దేశంలో, రాష్ట్రంలో సిద్దిపేట కీర్తిని చాటుతున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో ఈ నవజాత శిశు కేంద్రాన్ని 2015లో ప్రారంభించారు. డైరెక్టర్ విమలాథామస్ ఆధ్వర్యంలో పీడీయాట్రిక్ వైద్యులు కార్పొరేట్ తరహాలో వైద్యం అందిస్తున్నారు. నవజాత శిశు కేంద్రంలో (ఎస్ఎన్‌సీయూ)లో 10వేల మందికి పైగా చిన్నారులు చికిత్స పొంది తల్లిదండ్రుల ఒడిలో సేదతీరుతున్నారు.



జీజీహెచ్ ఆసుపత్రిలోని ప్రభుత్వ పీడీయాట్రిక్ వైద్యబృందం

ఇతర జిల్లాల నుంచి...

జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు సిద్దిపేట జీజీహెచ్ ఆసుపత్రి బాట పడుతున్నారు. 2018 నుంచి నవంబరు 2024 వరకు దాదాపు 9,293 మంది చిన్నారులు ఆసుపత్రిలో చేరారు. వారిలో 7,956 మంది చిన్నారులు పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జి అయ్యారు. ఆసుపత్రిలోని పీడీయాట్రిక్ విభాగంలో 1.3 కిలోలకు పైగా ఉన్న చిన్నారులకు అందించే కంగారు మెథడ్ కేర్ తరహాలో "కంగారు ఫాదర్ కేర్"ను ప్రవేశపెట్టి చిన్నారుల బరువు పెరిగేలా చేస్తున్నారు. పసిపాపలను ఛాతీపై పడుకోబెట్టుకోవడంతో శరీరం నుంచి వచ్చే వేడి నుంచి వారు బరువు పెరుగుతున్నారు.

ఆసుపత్రిలో చేరిన చిన్నారులు

ఏడాది	అడ్మిట్	డిశ్చార్జి	రెఫరల్
2018	1288	1098	12.20%
2019	1021	863	11.10%
2020	732	506	9.70%
2021	967	718	2.50%
2022	1401	1316	2.50%
2023	1996	1864	1.50%
2024	1888	1748	1.90%

తగ్గిన రెఫరల్ కేసులు...

మొదట్లో మెరుగైన వసతులు లేకపోడంతో

మిగతా 8వ పేజీలో...



ఉత్సాహంగా మల్లకంబ ఎంపిక పోటీలు

సిద్దిపేట రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి); నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా మల్లకంబు క్రీడా అండర్-14, అండర్-17 బాలుర ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు స్తంభంపై చేసిన క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ప్రజావాణికి 62 దరఖాస్తులు

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మొత్తం 62 దరఖాస్తులు వచ్చాయని, అధికారులు ఆయా దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మీ సేవలో సదరం స్లాట్ల సంఖ్య పెంచాలి

- బాలమల్లు యాదవ్, మాజీ జడ్పీటీసీ వర్గల్

సదరం స్లాట్లు నోటిఫికేషన్ విడుదల కాగానే దివ్యాంగులు మీ సేవకు వెళ్లి బుక్ చేద్దామనుకున్నా దొరకడం లేదు. దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం స్లాట్లు పెంచాలి

రూ.6వేల పెన్షన్ మంజూరు చేయాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ప్రతినిధులు

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ మంజూరు చేసి దివ్యాంగుల ఆదుకోలి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచి, అమలు చేస్తామని హామీనిచ్చింది. హామీ మేరకు అమలు చేయాలి.

ప్రజాసంక్షేమం కోసం ప్రజాపాలన

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం ఏడాది కాలంలో నిరంతరాయంగా పనిచేస్తున్న ప్రభుత్వం ప్రజాపాలన ప్రభుత్వమని, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో ముందుకు సాగుతున్నామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి హుస్నాబాద్‌లో ప్రజాపాలన విజయోత్సవంలో కలెక్టర్ మనుచౌదరితో ఆయన కలిసి పాల్గొని మాట్లాడారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజల చిరకాల వాంచ గౌరవెల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రెండు పంటలకు సాగునీరు అందించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకు తగ్గట్టు రూ. 433 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. కాలువల తవ్వకం కోసం అవసరమైన భూసేకరణ కలెక్టర్ ఆధ్వర్యంలో వేగవంతంగా కొనసాగుతుందన్నారు. కలెక్టర్ మనుచౌదరి ఆధ్వర్యంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చేందుకు కంప్యూటర్, టెక్నికల్‌కు సంబంధించిన శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్, హుస్నాబాద్ నుంచి జనగామ వరకు రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. ఎల్లమ్మ చెరువును, మహాసముద్రం ప్రాంతాలను పర్యాటక క్షేత్రాలుగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. ప్రజాపాలన తీరుపై కళాకారుల ప్రదర్శించిన నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ బంక చందు, మున్సిపల్ కౌన్సిలర్ చిత్తారి పద్మ, సరోజన వల్లపు రాజు, స్వర్ణలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కళాకారుల నృత్యప్రదర్శనలు

అభివృద్ధి, ప్రజల కోసం ఏ పోరాటానికైనా సిద్ధం

- మాజీమంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అభివృద్ధి, ప్రజల కోసం తాను ఏ పోరాటానికైనా సిద్ధమేనని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 104 మంది లబ్ధిదారులకు రూ.25లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 9,800 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజా ఆరోగ్యం నిర్వీర్యమైందని, నేను పోను బిడ్డో సర్కారు దవాఖానకు అనే మాట ప్రజల్లో మళ్లీ మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేటలో రూ. 24 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు చేస్తే దాన్ని రద్దు చేసి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారని, వెయ్యి పడకల ఆసుపత్రి మంజూరు చేస్తే పనులు ఆపేశారని, కేన్సర్ కీమోథెరఫీ, రెడియోథెరఫీ మంజూరు చేస్తే రద్దు చేశారన్నారు. సిద్దిపేటకు మంజూరు చేసిన రూ.200 కోట్ల అభివృద్ధి పనులను రద్దు చేసి మంత్రి సీతక్క ములుగుకు తీసుకుపోతున్నారని ఆయన మండిపడ్డారు. సిద్దిపేటకు మంజూరైన నిధులను రద్దు చేస్తున్నారని, వెటర్నరీ కళాశాలను కూడా రద్దు చేసినట్లు చెప్పారు. కేసీఆర్ హయాంలో సిద్దిపేట జిల్లా, గోదావరి జలాలు, రైలు, సుడా చేసి సిద్దిపేటను అగ్రగామిగా నిలిపితే, అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఏ మొహం పెట్టుకొని ప్రజల్లో తిరుగుతారని ప్రశ్నించారు. సిద్దిపేట అభివృద్ధికి అడ్డుపడుతుంటే, ఇక్కడి కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అని ఎద్దేవా చేశారు. సిద్దిపేట అభివృద్ధికి మోకాళ్ల అడ్డుకునే నైజం కాంగ్రెస్ పార్టీదని, నాడు ప్రతిపక్షంలో ఉండి ఇక్కడి అభివృద్ధిని చూసి, కళ్లలో నిప్పులు పోసుకున్నారని, నేడు నిధులకు మోకాళ్లు అడ్డు పడుతున్నారని చెప్పారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటే రద్దు చేసిన పనులు ఇవ్వకుంటే వదిలిపెట్టే ప్రసక్తే లేదని, అసెంబ్లీలో కొట్లాడుతానని, అవసరమైతే కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

నారుమడి..

జాగ్రత్త మరి

- చలి దృష్ట్యా యాజమాన్య పద్ధతులు తప్పనిసరి
- యాసంగిలో వంగడాల ఎంపిక ముఖ్యం

7



కార్తీకమాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఆలయాలు కిటకిటలాడాయి. వర్గల్ నాచగిరి క్షేత్రంలో నిత్యదీపోత్సవం నిర్వహించారు. సిద్దిపేటలోని కోమటిచెరువులో మహిళలు దీపాలను వదిలారు

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్/వర్గల్

ఆ మూలమలుపులు

యమడేంజర్

- మృత్యుకుహరంగా ముస్యాల శివారు
- ఆదమరిస్తే అంతే సంగతులు

8

పంచాయతీ వాటర్ ట్యాంకర్ బోల్తా..

శివ్వంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిజిలీపూర్ గ్రామంలో మన్నే నారాయణ మృతి చెందడంతో సోమవారం అంత్యక్రియల కోసం గ్రామ పంచాయతీ కార్మికుడు సాయికుమార్ గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌లో నీళ్ల తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో పంట పొలాల్లోని ఒడ్డు వద్ద ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది.

160 గిర్రల బండి.. నెమ్మదిగా కదులుతదండి..

జహీరాబాద్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ఓ కర్మాగారం నుంచి సోమవారం ఓ భారీ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాజస్థాన్‌లోని జసల్‌మేర్ జిల్లాకు 160 టైర్ల లారీపై తరలించారు. జహీరాబాద్ సమీపంలోని 65వ నంబర్ జాతీయరహదారి మీదుగా వెళ్తుండగా ప్రయాణికులు ఆసక్తిగా చూశారు. గమ్యం చేరుకోవడానికి సుమారు నెల రోజులు పడుతుందని లారీ డ్రైవర్ తెలిపారు.



ఎన్నాళ్లిలా..?

గుమ్మడిదల. నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుక్కులు దున్నలేము వరి కోతలు కోయలేము అనే పరిస్థితి గుమ్మడిదల గ్రామంలో నెలకొంది. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాడి ఉన్న విద్యుత్ వైర్లతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని మద్దుల బాల్ రెడ్డి పంట పొలంలో వరి కోతలు కోస్తుండగా విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ హార్వేస్టర్‌కు తాకేలా ఉండడంతో రైతు కర్రతో పైకి లేపి వరి కోత చేపట్టారు. మండలంలో చాలా మంది రైతుల పొలాల్లో ఈ పరిస్థితి ఉన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని రైతులు కోరుకొంటున్నారు.



75 ఏళ్ల సందర్భం..

● రావి ఆకుపై చిత్రం

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): 1949 నవంబరు 26న భారత రాజ్యాంగానికి రాజ్యాంగసభ ఆమోదం తెలిపింది. ఇది మంగళవారం నాటికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భాన్ని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ రావి ఆకుపై రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, పార్లమెంట్ భవనం, రాజ్యాంగ చిత్రం, జాతీయ చిహ్నాలను మలిచారు.



సంఘటితంతోనే సమస్యల పరిష్కారం

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పుల్‌కల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంఘటిత శక్తితోనే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు పిలుపునిచ్చారు. చౌటకూర్ మండలం శివంపేట చార్మినార్ బీరు పరిశ్రమలో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు-కార్మికులపై ప్రభావం' అనే అంశంపై పరిశ్రమ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పీ.బాగారెడ్డి అధ్యక్షతన సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం ఐక్యంగా ఉండాలన్నారు. కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను ఉప సంహరించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జనవరి 25 నుంచి 28 వరకు సీపీఎం మహాసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, సీబీఎల్ పరిశ్రమ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్నరావు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోడూరి సురేష్, యూనియన్ నాయకులు ఏర్పుల నాగభూషణం, పుర్ర మల్లారెడ్డి, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

యాసగి సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్న వేళ వ్యవసాయ అధికారులు కీలక సూచనలు చేస్తున్నారు. నారుమడిపై చలి ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా వరి నారును తెగుళ్ల నుంచి కాపాడుకోవాలని ఊరూరా అవగాహన కల్పిస్తున్నారు. వరిని చలి నుంచి రక్షించుకోవడం, మందుల పిచికారీ తదితరాలపై అధికారులు చెబుతున్న సూచనలు, సలహాలు మీ కోసం.



నారుమడి.. జాగ్రత్త మరి

చలి దృష్ట్యా యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

● యాసంగిలో వంగడాల ఎంపిక ముఖ్యం
● నారుపై చలి ప్రభావం పడకుండా చూడాలి
● ఊరూరా రైతులకు అధికారుల అవగాహన

సిద్దిపేట అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వానకాలం పంట కోతలు పూర్తయిన వెంటనే రైతులు యాసంగి పంటకు దుక్కులు దున్ని నారుమడులు సిద్ధం చేసుకుంటుంటారు. నారు పోసుకునే ముందు ఆ మడికి సరిపడా సుమారు రెండు క్వింటాళ్లు బాగా మాగిన పశువులు లేదా కోళ్ల ఎరువుతోపాటు కిలో వరకు జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. మడులపై చలి ప్రభావం పడకుండా ప్రత్యేక యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. యాసంగిలో రైతులు ఎక్కువగా దొడ్డు రకం వరి సాగుకు మొగ్గు చూపుతుంటారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని స్వల్పకాలిక రకాలైన సన్నాలు సాగు చేయాలి. స్వల్పకాలిక రకాలైన (120-130రోజుల పంట కాలం) కూనారం సన్నాలు(కేఎన్ఎం-118), జగిత్యాల రైస్-1(జేజీఎల్-24423), వంటి రకాలు వేసుకోవాలి. రైతులకు నవంబరు 15 నుంచి డిసెంబర్ 20 మధ్యలో నారు పోసుకుంటే మేలుగా ఉండడంతోపాటు చలి ఉధృతిని బట్టి పంట కాలం 10 నుంచి 15 రోజులకు పెరిగే అవకాశం ఉంటుంది. నారుమడిలో మండె కట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరిగా అలవాటు చేసుకుంటే బాగుంటుంది. భాస్వరాన్ని రెట్టింపు మోతాదులో వేసుకొని రాత్రిపూట నారుమడిలో నీళ్లు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తగ్గుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఉదయం, పగటిపూట వెచ్చని నీటిని పెట్టి సాయంత్రం తీసివేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడి చుట్టూ ఒక అడుగు ఎత్తులో పలుచని పాలిథీన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచులతో కుట్టిన పట్టాలను సాయంత్రం వేలలో కప్పి ఉదయం పూట తీసివేయాలి. రైతులు ఇటువంటి పద్ధతులు పాటిస్తే మంచి నారుమడి చేతికి అందుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తగ్గినప్పుడు చలి తీవ్రత పెరిగి నారు ఎర్రబడడం, సరిగ్గా ఎదగకపోవడం పంట కాలం పెరిగిపోవడం, పోషకలోపాలు ముఖ్యంగా జింక్ లోప లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. జింక్ లోపంతో ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడి నష్టం జరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే నారుమడి మంచిగా చేతికింది. అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది.

సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలి..

నారుమడలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతుల వద్దకే నేరుగా వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో ఇప్పటికే నాలుగు ఐదు గ్రామాలలో పర్యటించి రైతులకు వివరించాం. ఇంకా రైతులకు సందేహాలు ఉంటే నేరుగా గాని ఫోన్ ద్వారా గాని సంప్రదించి సలహాలను తీసుకోవచ్చు. యాసంగి పంటలో సన్నాలను ఎంచుకొని అవసరమైన మేరకు ఎరువులను ఉపయోగించి మేలైన పద్ధతుల ద్వారా అధిక దిగుబడులను పొందవచ్చు.

- శ్రీనాథ్, మండల వ్యవసాయాధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలి తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రదేశాలలో నీటి నిల్వ రాత్రిపూట లేకుండా చూసుకోవాలి. అదే విధంగా అవసరమైన మేరకు నీటిని నిల్వ చేసుకోవాలి.
- నివారణకుగాను లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉంటే స్వర్ణపాల్/పార్ములా -4వంటి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 5రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారి చేసుకోవాలి.
- కాండం తొలిచే పురుగు బారి నుంచి నారును కాపాడుకునేందుకు, నారు తీయడానికి వారం రోజుల ముందు, 5 సెంట్ల నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉంటే అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంటుంది కాబట్టి ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలి.

పై పద్ధతులను రైతులు పాటిస్తే ఆరోగ్యవంతమైన నారు పెంచుకొని, తద్వారా అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. చలికాలంలో నారుమడలపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వ్యవసాయ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

క్రైం కార్నర్

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

మనోహరాబాద్, నవంబరు 25:(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాళ్లకల్ జాతీయ రహదారి పై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని జాతీయ రహదారి పక్కన దీపక్ దాబాలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి భోజనం అడుక్కొని తిని రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. దాబా యాజమని చూసి గ్రామా కార్యదర్శి గడ్డ రాజుకు సమాచారమివ్వడంతో ఆయన ఘటన స్థలం చెరుకోని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సుమారు 26 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎత్తు 5.5, గులాబి రంగు అంగి, నల్లని ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమందు కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు దోషులకు ఐదేళ్ల జైలు శిక్ష పడింది. జిల్లా ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016 సంవత్సరంలో పటాన్‌చెరుకు చెందిన గొల్ల రమణ, రవీందర్ యాదవ్ నల్లమందు విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ మేరకు అప్పటి ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి కేసు నమోదు చేశారు. కోర్టులో పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25వేల చొప్పున జరిమానా విధించారు. డ్రగ్స్ కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ హరికిషన్ అభినందించారు.

శిలువకు నిప్పు

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సత్యగామ గ్రామ చౌక్‌లో మూడుదారులు ఉండే చోట ఎప్పటి నుంచో శిలువ ఉంది. ఆదివారం దుండగులు దీని చుట్టూ కట్టెలు పేర్చి నిప్పు పెట్టడంతో సోమవారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దుశ్చర్యకు పాల్పడ్డవారిని గుర్తించి కఠినంగా శిక్షించి ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దొంగల బీభత్సం

● రూ.3 లక్షల విలువగల నగలు చోరీ

నారాయణఖేడ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన గృహాలే లక్ష్యంగా దొంగలు బీభత్సం సృష్టించారు ఆదివారం అర్ధరాత్రి ఇళ్లలో చొరబడి రూ.3 లక్షల విలువ చేసే నగలతోపాటు నగదును అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాస డిగ్రీకళాశాల సమీపంలోని ముత్యాల ప్రియాంకకు చెందిన భవనంలో పలు కుటుంబాలు అద్దెకు ఉంటున్నాయి. ఈ భవనంలోనే నివాసముంటున్న ప్రియాంక తమ ఇంటికి తాళం వేసి కొన్ని రోజులుగా ఖేడ్‌లోని బంధువుల ఇంటిలో ఉంటున్నారు. భవనం కిందిభాగంలో సిర్గాపూర్‌కు చెందిన జగన్మోహన్ కుటుంబంతో నివాసముంటుండగా.. ఆయన కూడా ఇంటికి తాళం వేసి పటాన్‌చెరులోని కుమారుడి వద్దకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు మొదటగా ప్రియాంక ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించగా అక్కడ ఎలాంటి నగుదు, విలువైన వస్తువులు లభించలేదు. అనంతరం జగన్మోహన్ ఇంట్లోకి చొరబడి అరకిలో వెండి, మూడు తులాల బంగారు గొలుసు, అరతులం చొప్పున ఉన్న రెండు ఉంగరాలు, రూ.5 వేలనగదును అపహరించుకుపోయారు. ఇంటి యజమాని ప్రియాంక ఫిర్యాదు మేరకు పోలీసులు క్లూస్ టీంతో వచ్చి ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా నిందితుడి స్వెటర్, టోపీ ధరించి కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఐఎస్ పోర్టల్‌పై అవగాహన పెంచుకోవాలి

● ఎన్ఎస్ఓ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అజిత్‌కుమార్

హైదరాబాద్ సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంస్థల నిర్వాహకులు ఏఐఎస్ పోర్టల్‌పై అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఓ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్.అజిత్‌కుమార్ అన్నారు. కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహకారంతో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రెడ్‌హిల్స్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై ఐటీ రిటర్న్స్, స్థిర ఆస్తులు, వర్కింగ్ క్యాపిటల్, రుణాలు, ఖర్చులు, ఇన్‌పుట్, ఉత్పత్తులకు సంబంధించిన చట్టాలు, పరిమితులు, గణాంకాల సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సర్వే ద్వారా సేకరించిన సమాచారం స్థూల దేశీయ ఉత్పత్తికి, పారిశ్రామిక రంగం సహకారాన్ని అంచనా వేయడానికి సహాయపడుతుందన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎన్ఎస్ఓ, ప్రాంతీయ కార్యాలయం హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతిరెడ్డి, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ డైరెక్టర్ టి.సుజాత ఎస్ఎస్ఓలు కె. గురుస్వామి, రమేష్ మెండుతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజిత్ కుమార్

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వండి

● 'హార్టీ' వర్సిటీ వీసీ రాజిరెడ్డి



అధికారులతో సమావేశమైన వీసీ రాజిరెడ్డి

ములుగు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీకి పరిశోధనలు వెన్నెముక అని, రైతుల గ్రాస్‌రూట్ లెవల్ సమస్యలపై శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధన చేయాలని శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అన్నారు. సోమవారం ములుగులోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ద్వైమాసిక సమావేశంలో డైరెక్టర్లు, అధికారులు, శాస్త్రవేత్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ రీసర్చ్ స్కాలర్లు అధునాతన పరిశోధనల ద్వారా ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఉత్తమ ఫలితాల కోసం శాస్త్రవేత్తలు కూడా బృందంలో పనిచేయాలని పేర్కొన్నారు. సమావేశంలో యూనివర్సిటీ అధికారులు, అసోసియేట్‌లు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో నికాన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్

● అత్యున్నత స్థాయి పరిశోధనలే లక్ష్యం



ఒప్పంద పత్రాలను చూపుతున్న నికాన్ ప్రతినిధులు, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేశంలో మొదటి నికాన్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నికాన్ ప్రతినిధులు, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. మైక్రోస్కోపీ టెక్నాలజీలో అత్యున్నత స్థాయి పరిశోధనలు నిర్వహించే లక్ష్యంతో నికాన్ ఇండియా ఐఐటీ-హెచ్ సహకారంతో ఈ సెంటరుకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, నిపుణులు, విద్యార్థులకు అధునాతన మైక్రోస్కోపీ టెక్నాలజీని ఈ సెంటర్ పరిచయం చేస్తుందని సమన్వయకర్త డాక్టర్ శౌర్యదత్త గుప్తా అన్నారు. మానవ కణజాలాన్ని వివిధ స్థాయిల్లో అధ్యయనం చేసేందుకు ఇక్కడ ఉన్న అత్యధిక రెజొల్యూషన్ ఇమేజింగ్ పరిజ్ఞానం తోడ్పడుతుందన్నారు. కణ జీవ శాస్త్రంతో పాటు పలు శాస్త్ర రంగలకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం ఈ సెంటర్‌లో అందుబాటులో ఉంటుంది. ఎన్ఎస్పీఏఆర్సీ సూపర్ ఇమేజింగ్‌తో కూడిన ఎఎక్స్ఆర్ పాయింట్ స్కానింగ్ సిస్టమ్ వంటి ఆధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ఏర్పాటుతో అన్వేషణాత్మక పరిశోధనలకు, కొత్త ఆవిష్కరణలకు ఏంతో అవకాశం ఉంటుందని, పరిశోధకులతో పాటు విద్యార్థులకు కూడా ఈ కేంద్రం ఎంతనో తోడ్పడుతుందని ఐఐటీ-హెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు.

చెరకు నరికేందుకు అటు.. పత్తి తీసేందుకు ఇటు..



ఉపాధి లేకే వలసలు..

తమకు స్థానికంగా ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే ప్రమాదకరమని తెలిసినా కుటుంబాల పోషణ కోసం వలసలు వెళ్లాల్సి వస్తుందని కంగ్టి మండలం రాజారాం తండాకు చెందిన మధుర రమేష్‌నాయక్ అన్నారు. స్థానికంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తే తమకు వలసలు వెళ్లడం తప్పుతుందన్నారు.

● నారాయణఖేడ్ డివిజన్‌లో వలసల వి'చిత్రం'..
● చెరకు తోటల్లో పనిచేసేందుకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్న గిరిజనులు
● పత్తి తీసేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి రప్పిస్తున్న రైతులు

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చెరకు సీజన్‌లో నారాయణఖేడ్ ప్రాంతం నుంచి వేలాదిగా గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. దీంతో, తండాలు నిర్మానుష్యంగా మారుతాయి. కానీ, స్థానికంగా నీటి వసతిలేక రైతులు వర్షాధార పంటలనే సాగు చేస్తుంటారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు పండే పరిస్థితి కనిపించదు. ప్రతీ సంవత్సరం నవంబరు మాసం ప్రారంభం నుంచే చక్కెర కర్మాగారాల వద్ద పని చేయడానికి ఈ ప్రాంతంలోని గిరిజనులు చిన్నచిన్నపిల్లలతో ఎడ్ల బండ్లను తీసుకొని వలస వెళ్తుంటారు. నియోజకవర్గంలో దాదాపు 200 వరకు గిరిజన తండాలు ఉంటాయి. ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేకపోవడానికి తోడు పంటలు సక్రమంగా పండక పోవడంతో గిరిజనులకు కుటుంబాల పోషణ కోసం వలసలు వెళ్లక తప్పడం లేదు. ఈ ప్రాంతం నుంచి తెలంగాణ ప్రాంతంలోని కర్మాగారాలకే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలోని కర్మాగారాలకు కూడా గిరిజన కూలీలు వెళ్తున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో ఉండడంతో ఈ ప్రాంతంలో ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవు. దీంతో సాధారణంగా 30 శాతం ప్రజలు శాశ్వతంగా ఉపాధి కోసం వలస వెళ్లి ఇతర ప్రాంతాల్లో జీవిస్తుంటారు. గిరిజనులు మాత్రం ప్రతి సంవత్సరం చెరకు సీజన్‌లో మాత్రమే వెళ్తారు. సీజన్ వచ్చిందంటే గిరిజన తండాల నుంచి అనేక మంది ఎడ్లబండ్లతో పాటు తమ వద్ద ఉన్న పశువులను వెంట తీసుకుని వెళ్తుంటారు. వలసల సీజన్‌లో తండాలలోని తమ గృహాలలో వృద్ధులు, చిన్నారులు మాత్రమే ఉంటారు. చిన్నారులను చూసుకునే వారు లేని వారు మాత్రమే వారిని తమ వెంట వలసలకు తీసుకెళ్తుంటారు. వలస వెళ్లిన సమయంలో కర్మాగారాల వద్ద చిన్నచిన్న పూరిపాకలను వేసుకుని జీవిస్తుంటారు. ఒక వైపు గజగజ వణికే చలి, మరో వైపు కుటుంబ పోషణ కోసం గత్యంతరం లేక కర్మాగారాల వద్ద పని చేయాల్సి వస్తుందని పలువురు అంటున్నారు. వలసలు వెళ్లిన సమయంలో ప్రమాదాల బారిన కూడా పడుతున్నామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అయినప్పటికీ గత్యంతరం లేక వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ఖేడ్ ప్రాంతంలోని ఏ దారి చూసినా వలస వెళ్తున్న గిరిజనులే కనిపిస్తున్నారు. ఈ సంవత్సరం అధిక వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తమకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తే వలస వెళ్లాల్సిన అవసరం లేదని పలువురు పేర్కొన్నారు. ఖేడ్ నుంచి పక్షం రోజులుగా వలసలు ప్రారంభం అయ్యాయి.

పత్తి తీయడానికి ఇతర రాష్ట్రాల కూలీలు...

నారాయణఖేడ్ డివిజన్‌లో పెద్ద మొత్తంగా పత్తి సాగు చేస్తున్నారు. ఈసంవత్సరం అధిక వర్షాల వల్ల పంట దిగుబడి సక్రమంగా లేదు. ఈ క్రమంలో పంట చేతికి అందినప్పటికీ, పంటను తీయడానికి స్థానికంగా కూలీలు దొరకడం లేదు. ఈ క్రమంలో కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పత్తి తీయడానికి కూలీలను రైతులు దిగుమతి చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్, కర్నూల్ జిల్లాల నుంచి వచ్చిన కూలీలు వ్యవసాయ క్షేత్రాలలో గూడారాలు వేసుకొని పత్తిని తీస్తున్నారు. పత్తిపంట సక్రమంగా లేక పోవడంతో గిట్టుబాటు కావడం లేదని, కిలోపత్తి తీయడానికి రూ.12 నుండి 15 తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణఖేడ్ డివిజన్‌లో దాదాపు 95,201 వేల ఎకరాల్లో 46,467 మందిరైతులు పత్తిపంటను సాగు చేశారు. ఏదేమైనా పత్తిపంటను తీయడానికి ఇతర రాష్ట్రాలనుంచి కూలీలను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆ మూలమలుపులు యమడేంజర్

- మృత్యుకుహరంగా ముస్త్యాల శివారు
- ఆదమరిస్తే అంతే సంగతులు



ప్రమాదకరంగా చేర్యాల మండలం ముస్త్యాల శివారులోని మూలమలుపు

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారిపై చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ శివారు ప్రగతి విద్యానికేతన్ హాస్టల్ సమీపంలోని మూలములుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఈ దారివెంట నిత్యం వందలాది వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. చాలాకాలంగా మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా.. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం ఎన్‌హెచ్ అధికారులు కూడా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎలాంటి ప్రమాద హెచ్చరికల బోర్డులూ ఏర్పాటు చేయలేదు. హాస్టల్ చేరువలో వీరన్నపేట క్రాస్‌రోడ్డు సమీపంలోని మూలమలుపు నుంచి కొద్ది దూరంలోని కల్వర్టు మూలమలుపు వరకు రోడ్డు దెబ్బతింది. పలు ప్రదేశాల్లో బీటీ లేచి గుంతలు ఏర్పడ్డాయి. సలాక్‌పూర్ క్రాస్‌రోడ్డు నుంచి వంపుగా ఉండడంతో మూలమలుపుల వద్ద వాహనం అదుపు కాకపోవడం, చీకటివేళల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడం, కల్వర్టుల రెయిలింగ్‌కు ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు బోల్తాపడడమే కాకుండా ఢీకొంటున్నాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఎత్తు, పల్లాలు సవరించాల్సి ఉన్నా మార్కింగ్‌కే పరిమితమైంది.



ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కట్కూరు వాసులు

తరచూ ప్రమాదాలే..

ఇటీవల కారు ఢీకొన్న సంఘటనలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరు గ్రామానికి చెందిన ఇరువురు దుర్మరణం చెందారు. గతంలో చేర్యాలలో పనిచేసిన ఓ సీఐ కారు బోల్తాపడింది. అంతకుముందు మరో ఎస్‌ఐ కారు బోల్తాపడటంతో గాయాలపాలయ్యాడు. చాలాకాలంగా పలు ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో డేంజర్ రోడ్‌గా మారింది. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందిన తర్వాత అధికారులు స్పందించారు. పిచ్చిమొక్కలు తొలగించి, రోడ్డుపక్కన ఇసుక బస్తాలను వేయించారు. జనగామ నుంచి దుద్దెడ క్రాస్‌రోడ్డు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు చివరిదశకు చేరుకున్నా ముస్త్యాల శివారులోని ప్రమాదకర మూలమలుపుల ప్రదేశం వద్ద చేపట్టకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. అధికారులు స్పందించి పనులు పూర్తిచేయడంతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



ముస్త్యాల గ్రామ శివారులోని మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఓ మూలమలుపు నుంచి మరో మూలమలుపు వరకు రోడ్డు పాడైపోయింది. జాతీయ రహదారి విస్తరణతో సరిచేయాల్సి ఉన్నా పనుల్లో జాప్యం వహిస్తుండటంతో ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలి.

\- మర్మాముల కిషన్, ముస్త్యాల

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం



ముస్త్యాల శివారులో మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం. ఇటీవల రోడ్డుపక్కన పిచ్చిచెట్లు తొలగింపజేశాం. చీకటి వేళల్లో ప్రమాదం జరగకుండా ఉండేందుకు థర్మోప్లాస్టిక్ పెయింట్స్, హజ్జాడ్ మార్కర్, రేడియం స్టేడ్స్, బ్రింగ్ లేటర్స్, సైనింగ్ బోర్డు, వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయిస్తాం. పరిమిత వేగంతో ప్రయాణం చేయడం, రోడ్డు భద్రత పాటించడాన్ని ప్రజలు అలవర్చుకోవాలి.

\- సీఎల్.శ్రీను, చేర్యాల సీఐ

ప్రాణం పోస్తున్నారు

మిగతా 8వ పేజీలో...



నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో చికిత్స పొందుతున్న చిన్నారులు

కేసులను హైదరాబాద్‌కు రిఫర్ చేసేవారు. ఆ తర్వాత జీజీహెచ్‌లో 20 బెడ్లు, 10 ఫొటో థెరపీ, 20 వార్మర్లు, 5 వెంటిలేటర్లు, 9 సీపాప్, 5 హెచ్ఎఫ్ఎన్‌సీలను మంజూరుచేయడంతో రానురాను రిఫర్ కేసులు తగ్గాయి. క్రమంగా శిశుమరణాల రేటు కూడా తగ్గడం విశేషం. రెండేళ్ల క్రితం యూనిసెఫ్ నిర్వహించిన వైద్యసేవ సర్వేలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. నేషనల్ నియోనాటోలజీ ఫోరం వైద్యసేవలను మెచ్చుకున్నది.

ఆరోగ్యం మెరుగవుతుందనుకోలేదు



గత నెల 25న సిద్దిపేటలోని జీజీహెచ్ ఆసుపత్రిలో కవలలకు జన్మనిచ్చాను. బాబు, పాప 1.5 కిలోలతో పుట్టి క్రమేణ 1.2 కిలల మేరకు తగ్గారు. వైద్యులు అక్కున చేర్చుకుని మాలో ధైర్యం నింపారు. చికిత్సలు నిర్వహిస్తూ, కంగారు మెథడ్ కేర్ ద్వారా ఇద్దరు పిల్లలను 1.49 కిలోల వరకు బరువు పెంచారు. కవలలిద్దరినీ పూర్తి ఆరోగ్యంతో చూస్తానని అనుకోలేదు. వైద్యులకు రుణపడి ఉంటాను. పిల్లలకు నేను జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిచ్చారు.

\- ఫర్జానా, గండిపల్లి, హుస్నాబాద్

కలిసికట్టుగా పనిచేస్తున్నాం



సిద్దిపేటలోని 300 పడకల ఆసుపత్రిలో అధునాతనమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పీడియాట్రిక్ విభాగంలోని వైద్యులు, సిబ్బంది టీంలాగా అందరం కలిసికట్టుగా పనిచేస్తున్నాం. అందుకే దేశంలో, రాష్ట్రంలో సిద్దిపేట కీర్తిని చాటుతున్నాం, మరిన్ని వైద్య పరికరాలు అందిస్తే సేవలను విస్తృతపరుస్తాం. సిద్దిపేటతో పాటు ఇతర జిల్లా నుంచి ప్రసవాల కోసం వందలాది సంఖ్యలో వస్తున్నారు. పసిపాపల ప్రాణాలను నిలుపుతూ వారికి విశేష సేవలందిస్తున్న మా వైద్యులు, సిబ్బందిని అభినందిస్తున్నా. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవలందించేలా కృషి చేస్తాం.

\- విమలాథామస్, ప్రభుత్వ మెడికల్ కళాశాల డైరెక్టర్

న్యూస్ బాక్స్

హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి

గజ్వేల్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి అన్నారు. సోమవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్‌కు జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్‌శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టల్స్‌లో సమస్యలు తిష్ట వేశాయని, కనీస సదుపాయాలు కరువయ్యాయని అన్నారు. గజ్వేల్ ఎస్టీ హాస్టల్స్‌లో బాత్‌రూంకు డోర్లు, ప్రహరీ లేక పందులు, కుక్కలు, పాములు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

మిరుదొడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మిరుదొడ్డి మండలంలోని మిరుదొడ్డి, చెప్యాల, కాసులాబాద్, అందె, ఆరెపల్లి గ్రామాలకు చెందిన అనిత రూ.18 వేలు, వసంతకు రూ.12 వేలు, చీకల రాజవ్వకు రూ.13,500, రాములకు రూ.12 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో బీజేపీ మండలాధ్యక్షుడు దేవరాజు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, మల్లేశం, రమేష్ పాల్గొన్నారు.

హబ్షీపూర్‌లో పశు వైద్య శిబిరం

మిరుదొడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక మండలం హబ్షీపూర్ గ్రామంలో సోమవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌శర్మ పాల్గొన్నారు.

'మురుగునీటిని తొలగించండి'

మద్దూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తన పట్టా భూమిలోకి వస్తున్న డ్రైనేజీ మురుగునీటిని మళ్లించాలని పబ్బతి బాలలక్ష్మి, పబ్బతి శ్రీనివాస్ సోమవారం ఎంపీడీవో రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై వారు మాట్లాడారు. గ్రామానికి చెందిన డ్రైనేజీ నీళ్లను తన పట్టా భూమిలోకి మళ్లించడం ద్వారా వరిసాగు చేసుకోలేని పరిస్థితి ఉందన్నారు. పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, వెంటనే డ్రైనేజీ నీటిని మళ్లించాలని కోరినట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ దినోత్సవం

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం నాగపురి శివారు గండికుంట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఈసీసీఈ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ గొట్టం జ్యోతి గర్భిణి, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

'ప్రజాసంకల్ప దీక్షను విజయవంతం చేయాలి'

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న చేర్యాల పట్టణంలోని అంగడిబజారు చౌరస్తా వద్ద చేపట్టనున్న ప్రజాసంకల్ప దీక్షను విజయవంతం చేయాలని జేఏసీ అధికార ప్రతినిధి అందె అశోక్ కోరారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో సోమవారం ప్రజాసంకల్ప దీక్ష కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం గుర్జకుంట క్రాసింగ్ సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం దుబ్బగుంటపల్లికి చెందిన కందుల నర్సింహులు తీవ్రగాయాలపాలయ్యాడు. నర్సింహులు బైక్‌పై చేర్యాల వైపునకు వస్తుండగా, వేచరేణి వైపునకు వెళుతున్న ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన నర్సింహులును స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 11 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి కొన్నిరోజుల నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాల్లో, రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 11 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపర్చగా.. విచారణ చేసి 11 మందికి రూ.12 వేల జరిమానా విధించారు.

చేనేత సంక్షేమ బోర్డుకు రూ.1000 కోట్లు కేటాయించాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శాంతికుమార్

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల ఉపాధి, సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేసి రూ.1000 కోట్లు నిధులు కేటాయించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్ అన్నారు. చేర్యాల పట్టణంలోని చేనేత సహకార సంఘం సొసైటీని సోమవారం సందర్శించి కార్మికులతో సమావేశమై మాట్లాడారు. మానవ సమాజ మనుగడ, ప్రజల గౌరవ ప్రతిష్ఠల పరిరక్షణలో కీలకమైన చేనేత వస్త్ర పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మనుగడలేకుండా చేసిందన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కరువై ఆకలి చావులు, ఆత్మహత్యలకు గురవుతున్నారన్నారు. కూలీ గిట్టుబాటు అందించడంతో పాటు కనీస వేతనాలు అందించాలని, జీఎస్టీ తొలగించి ప్రతీ కార్మికుడికి రూ.5 లక్షల పెట్టుబడి సహాయం చేయాలని, ఆరోగ్యబీమా, చేనేత రుణాల మాఫీ, నూలు, రంగుల సబ్సిడీ పథకం నగదు బదిలీ కొనసాగించాలని కోరారు. డిసెంబరు 10న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న చేనేత పడుగుపేకల ఆత్మీయ కలయిక కార్యక్రమ విజయవంతానికి నేతన్నలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బడుగు శంకరయ్య, ముష్యం నరహరి, కొంగరి వెంకట్‌మావో, పాము బాలనర్సయ్య, వెంకటేశం, చక్రపాణి, రామచంద్రం, యాదగిరి, గంధాల బాబు, నర్సింహులు పాల్గొన్నారు.



పట్టణంలోని చేనేత సహకార సంఘ భవనంలో మాట్లాడుతున్న శాంతికుమార్

వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

- హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

వర్గల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ప్రాంగణంలో అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో పాల్గొన్నారు. ఆలయం సమీపంలో పడిపూజ కోసం శబరిమలను తలపించే విధంగా పచ్చని పూల పందిళ్లు, పూల మండపాలు, దేవతామూర్తుల విగ్రహాలు 18 మెట్ల పడిపూజ తిలకించడానికి వచ్చిన భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ వేదపండితుడు వేదాంతం మురళీధరచార్యుల నేతృత్వంలో మహాపడి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, లతారమేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్, పార్టీల మండలాధ్యక్షులు సందీప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు, భక్తులు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.



పడిపూజలో అయ్యప్పస్వాములతో నర్సారెడ్డి

విగ్రహ ప్రతిష్ఠాపనలో హరీశ్‌రావు

కుకునూరుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముద్దాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ పెద్దిరాజు ఆలయంలో ధ్వజస్తంబ విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

- అదనపు డీఆర్డీవో మధుసూదన్

సిద్దిపేట రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ప్రతీ గింజనూ మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడవద్దని అదనపు డీఆర్డీవో మధుసూదన్ సూచించారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చంద్రం, సీసీలు ఆనంద్‌గౌడ్, హేమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం మాయిశ్చర్‌ను పరిశీలిస్తున్న మధుసూదన్

ఉచిత చేపపిల్లల పంపిణీలో అన్యాయం



రంగనాయకసాగర్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

చిన్నకోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు ముదిరాజ్‌ల గురించి గొప్పలు మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ఉచిత చేపపిల్లల పంపిణీలో అన్యాయం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, రైతుబంధు సమితి మాజీ జిల్లా డైరెక్టర్ వెంకటేశం, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముదిరాజ్‌లకు నూతన మత్స్య సొసైటీలు ఏర్పాటుచేసి 100 శాతం సబ్సిడీ కింద ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేశారన్నారు. ఉచిత చేపపిల్లల పంపిణీలో కాంట్రాక్టర్లు, అధికారులు చేతివాటం చూపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల బీఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు సుమన్, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ నాయకులు రాజు, శంకర్, లింగం, నాగరాజ్, బాలరాజ్ పాల్గొన్నారు.

'గురుకుల పాఠశాల సమస్యలను పరిష్కరించాలి'

కొండపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం దుద్దెడలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గురుకుల పాఠశాలల పేరెంట్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం, పౌష్టికాహారం, పరిశుభ్రమైన పరిసరాలు మౌలిక వసతులు లేవని పేర్కొన్నారు. తరగతి గదులు, డార్మెట్రీ రూమ్‌లలో తిరగని ఫ్యాన్లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని తెలిపారు. అధికారులు స్పందించి గురుకుల పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పశుగణనకు ప్రజలు సహకరించాలి



జగదేవ్‌పూర్‌లో పశుగణన చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ శ్వేత

జగదేవ్‌పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలవ్యాప్తంగా కొనసాగుతున్న పశుగణన కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్వేత కోరారు. మండల కేంద్రంతో పాటు లింగారెడ్డిపల్లిలో జగదేవ్‌పూర్ ప్రాథమిక పశు వైద్య సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం పశుగణన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం రెండునెలల పాటు కొనసాగుతుందన్నారు. ప్రతి రైతు తమ పాడి పశువుల పోగులు(ట్యాగ్) నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఈ సర్వేలో వెటర్నరీ అసిస్టెంట్ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, గోపాలమిత్రలు కనకస్వామి, యాదగిరి పాల్గొన్నారు.

ఘనంగా మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపన

- హాజరైన జనగామ డీసీసీ అధ్యక్షుడు 'కొమ్మూరి'

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని మడేలయ్య ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల శాస్త్రోక్త యుక్త మంత్రోశ్చరణల మధ్య మడేలయ్య తదితర దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి హాజరై మడేలయ్యను దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనను సత్కరించారు. కాగా సాయంత్రం మహిళలు భక్తిప్రపత్తుల నడుమ బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రతిష్ఠాపనలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

సీపీకి ఎరుకల సంఘం నాయకుల కృతజ్ఞతలు

సిద్దిపేట క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దొంగతనం జరిగిన పందులను సీపీ డాక్టర్ బీ.అనురాధ చొరవతో పోలీస్ అధికారులు రికవరీ చేసినందుకు ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుత్తడి రాములు, జనరల్ సెక్రెటరీ మండలాపురం గోపాల్, మండల, జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం సీపీని కలిసి పూలబొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కుకునూరుపల్లి, దుబ్బాక, త్రీటౌన్, గౌరారం, మర్కుక్, పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన పందుల దొంగతనాల కేసుల్లో కుకునూరుపల్లి పోలీసులు 33 పందులను, రూ.75 వేల నగదును రికవరీ చేసి, నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

'ప్రజాపాలన సంబరాలను నిర్వహించాలి'

జగదేవ్‌పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రజాపాలన ఏర్పడి సంవత్సరం పూర్తయినందున మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేకాధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏదైనా ఒక పనిని కనీసం 50 మంది కూలీలతో ప్రారంభించాలని సూచించారు. గ్రామంలోని ఉపాధిహామీ, హరితహారం, పారిశుధ్య విభాగంలో మంచి వర్కర్‌ను గుర్తించి ప్రజల సమక్షంలో సన్మానించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, మండల పంచాయతీ అధికారి ఎండీ ఖాజామొయినొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ రఘువీరారెడ్డి, ఏపీవో శ్యామల, ఈసీ సుధాకర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిడియన్ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో పట్టణంలోని మెరిడియన్ (బ్రాంచ్ 2) విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అథ్లెటిక్స్ అండర్-14 విభాగం స్టాండింగ్ జంప్‌లో వకుల్ బంగారు పతకం సాధించగా, హర్షిత్‌రెడ్డి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. 300 మీటర్ల రన్నింగ్, లాంగ్‌జంప్‌లో శైరిన్ కాంస్య పతకం కైవసం చేసుకుంది. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, రాజ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దినేష్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మృతి బాధాకరం

- నిత్యం ప్రజాసేవ, అభివృద్ధిపైనే తపన
- మాజీ సీఎం కేసీఆర్‌కు ఆత్మీయులు
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మృతి బాధాకరమని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాకలో రామచంద్రారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రామచంద్రారెడ్డి తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కు ఎంతో ఆత్మీయులన్నారు. నిత్యం ప్రజాసేవ, అభివృద్ధిపైనే తపన పడ్డారన్నారు. రామచంద్రారెడ్డి కోరిక మేరకు కేసీఆర్ గత ప్రభుత్వంలో రూ.10 కోట్ల నిధులు గ్రామ అభివృద్ధికి మంజూరు చేశారని పేర్కొన్నారు.రామచంద్రారెడ్డి ఆస్పత్రి ఖర్చులకు గత ప్రభుత్వం నుంచి కేసీఆర్ ఆర్థిక సహాయాన్ని అందించారని గుర్తుచేశారు. అదేవిధంగా ఇంటి స్థలాన్ని కూడా మంజూరు చేసి గౌరవించుకున్నామని తెలిపారు. హరీశ్‌రావు వెంట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు చిట్టి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య, బాలచందర్, రాగల దుర్గయ్య, అలట ప్రశాంత్, నూనె కుమార్, రామకృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి ఉన్నారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి అంత్యక్రియలు సోమవారం కొండపాకలో అశ్రునయనాల మధ్య నిర్వహించారు.



రామచంద్రారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

అంత్యక్రియల్లో మాజీ మంత్రి

చిన్నకోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సోదరుడు, గురుకుల పాఠశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపల్స్ సంఘ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కూర రవీందర్‌రెడ్డి(62) గుండెపోటుతో ఆదివారం హైదరాబాద్‌లో మృతిచెందారు. సోమవారం ఆయన స్వగ్రామమైన చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని రవీందర్‌రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని మల్లారం గ్రామ రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తల్లి ఇంద్రవ్వ(75) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.